

సోమశిలలో 62.652 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 62.652 టీఎంసీల నీరుంది. ఎగువ నుంచి 1197 క్యూసెక్కులు వస్తుండగా 98.415 మీటర్ల నీటిమట్టం నమోదు అయింది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.88,120
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,940
3 శాతం జీఎస్టీతో	రూ.8,178
నవర (8 గ్రా)	రూ.65,424

గరిష్టం/కనిష్టం
33.2 /23.3

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

భోజనం బాగాలేదని విద్యార్థులు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఏసీఎస్ఆర్ కాలనీలోని మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగాలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా అన్నం సరిగా ఉడకడంలేదంటూ, కూరలు సైతం బాగాలేకపోవడంతో విద్యార్థులు వాంతులు చేసుకున్న సంఘటనలు జరిగాయని తల్లిదండ్రులు తెలిపారు. దీని గురించి భోజన పథకం నిర్వాహకులను ప్రశ్నిస్తే వెటకారంగా సమాధానం చెప్పారని ఓ విద్యార్థి తల్లి పేర్కొంది. ఈ విషయమై హెచ్ఎం హజరత్తయ్యను సంప్రదించగా భోజనం బాగాలేదని విద్యార్థులు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, నిర్వాహకురాలిని మందలించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పొదలకూరు రోడ్డులోని సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయనందున హెల్పర్లు, మినీవర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పెట్టుబడులు పెట్టి కేంద్రాలను నిర్వహిస్తున్నారన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనంగా రూ 26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా ప్రసాద్, నగర అధ్యక్షుడు అత్తిమూరు శ్రీనివాసులు, నాయకులు షాహినాబేగం, నాగభూషణమ్మ, సంపూర్ణమ్మ, రజని, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు రేషన్ అలాట్‌మెంట్

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని వివిధ చౌకదుకాణాలకు పది శాతం రేషన్ విడుదల చేసినట్లు డీఎస్ఓ అంకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సాక్షి'లో సోమవారం రేషన్ బియ్యం కోటాలో కోత శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. చౌక దుకాణాలకు పదిశాతం రేషన్ విడుదల చేశారు. కార్డుదారులు ఇబ్బందులు పడకుండా రేషన్ సరఫరా చేస్తామని డీఎస్ఓ తెలిపారు.

ముందస్తు సమాచారం లేకుండా పెన్నా డెల్టాకు నీటి విడుదల



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల జలాశయం నుంచి సోమవారం పెన్నా తీర ప్రాంతాల వారికి ఎలాంటి సమాచారం లేకుండా నీటిని విడుదల చేసినట్లు ప్రజలు తెలిపారు. దీనిపై జలాశయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దశరథరామిరెడ్డిని అడుగగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెన్నా దిగువ ప్రాంతంలోని రైతుల తాగు, సాగునీటి అవసరం కోసం నీటిని విడుదల చేశామన్నారు.

22న ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సూపర్ కప్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జట్టుకు క్రీడాకారులను ఈనెల 22న ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి బి.ఉమాశంకర్ సోమవారం తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 7.30 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు మార్చిలో జరిగే టోర్నమెంట్‌లో కోరమాండల్ జోనల్ ఫుట్‌బాల్ క్లబ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు.

నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళేనికి చెందిన సాయికుమార్ (పేరుమార్చాం) అనే కుర్రాడికి రెండు నెలల క్రితం కాళ్లు చచ్చుబడినట్టు అయిపోయాయి. క్రమేపీ తిమ్మిర్లు వచ్చాయి. మొదట ఆర్ఎంపీ, అనంతరం ఎముకల డాక్టర్ల వద్ద చూపించుకున్నాడు. వారి సూచనతో చెన్నైలోని విజయ హాస్పిటల్‌కు వెళ్లాడు. గులియన్ బ్యారో సిండ్రోమ్‌గా డాక్టర్లు నిర్ధారించారు. అక్కడ చికిత్స తీసుకున్నాడు. తరువాత అబ్జర్వేషన్ కోసం నెల్లూరు నగరంలోని ఫైన్ ఆస్పత్రికి వెళ్లాడు. మొత్తం అతనికి రూ.14 లక్షల వరకు ఖర్చు అయింది.

పొదలకూరు రోడ్డులోని పద్మావతినగర్‌కు చెందిన మహిళా బ్యాంకు ఉద్యోగినికి (23 ఏళ్లు) కాళ్ల నరాలు చచ్చుబడసాగాయి. గిచ్చినా నొప్పి తెలియలేదు. దీంతో నగరంలోని బ్యాంకు కాలనీలో ఉన్న ఓ న్యూరోస్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లింది. అక్కడ జీబీఎస్‌గా నిర్ధారించి చికిత్స చేశారు. రూ.8 లక్షలు ఖర్చు అయింది.

నవలాకుల గార్డెన్‌కు చెందిన సాయి అనే కుర్రాడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి డిసెంబర్‌లో కాళ్లు, చేతులు తిమ్మిర్లు పట్టసాగాయి. క్రమేపీ నడవలేకపోయాడు. నగరంలోని న్యూరో విభాగానికి చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆయనకు అయిన ఖర్చు అక్షరాల రూ.9 లక్షలు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.



భయపెడుతున్న జీబీఎస్

గులియన్ బ్యారో సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి జిల్లా వాసులను భయపెడుతోంది. ఈ వ్యాధి సోకితే కాళ్ల నుంచి, నడుము, మెదడు వరకు నరాలు చచ్చుబడి కదల్లేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఎక్కువ. గతంలో అరుదుగా వచ్చే ఈ వ్యాధి ఇప్పుడు జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది.

జీబీఎస్ వైరస్



పెద్దాస్పత్రిలోనే 20 కేసులకు చికిత్స


- ఇంజక్షన్ల సరఫరాను ఆపేసిన ప్రభుత్వం
- రూ.లక్షలు ఖర్చు పెట్టుకుంటున్న రోగులు
- కోలుకోవాలంటే నెల నుంచి ఆరునెలల సమయం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం
- కేసులు లేవంటూ దాచిపెడుతున్న జిల్లా వైద్యశాఖ

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ పెద్దాస్పత్రితో పాటు పలు ప్రైవేటు ఆస్పత్రులలో జీబీఎస్ రోగులు అడ్మిషన్‌లో ఉన్నారు. ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తూ రోగులు అప్పుల పాలవుతున్నారు. పూర్తిగా కోలుకునేందుకు ఒకటి నుంచి 6 నెలల సమయం పడుతోంది. ప్రభుత్వం వైద్యాన్ని గాలికొదిలేసి చోద్యం చూస్తోంది. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో జీబీఎస్ వ్యాధితో ఓ మహిళ మరణించడం, కేసులు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడంతో జిల్లా వాసులు ఉలిక్కి పడుతున్నారు.

ఇన్‌ఫెక్షన్లే కారణమా..?

ప్రధానంగా ఈ వ్యాధి రావడానికి బాక్టీరియల్, వైరస్ ఇన్‌ఫెక్షన్లే కారణంగా తెలుస్తోంది. గతంలో వీటి బారినపడి ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారికి పోస్ట్ బాక్టీరియా, వైరల్ వ్యాధిగా సోకుతున్నట్టు తెలిసింది. మనశరీరంలో ఉండే రక్షణ వ్యవస్థ (ఇమ్యూనిటీ సిస్టం) శత్రుకణాలుగా భ్రమపడి సొంత వ్యాధి నిరోధక శక్తిని కలిగించే కణాలపై దాడి చేయడం వల్లనే ఈ వ్యాధి సోకుతోంది. అందువల్లనే దీనిని ఆటో ఇమ్యూన్ సిస్టమ్ వ్యాధి అని కూడా అంటారు. ఫలితంగా ఇమ్యూనిటీ వ్యవస్థ దెబ్బతింటోంది. నాడీ వ్యవస్థపై దాడి చేయడానికి గులియన్ బ్యారో సిండ్రోమ్ ప్రేరేపిస్తుంది. ఫలితంగా పలువురికి పక్షవాతం కూడా వస్తోంది.

ఏ లక్షణాలు ఉంటాయంటే..



లక్షణాలలో ప్రధానంగా కండరాలు బలహీనంగా మారతాయి. కాళ్ల నుంచి మెదడు వైపునకు జలదరించినట్టు అనిపించడం, తిమ్మిర్లు, చచ్చుబడిపోవడం, నడవలేకపోవడం, జరుగుతుంది. కొన్నిసార్లు ఊపిరితిత్తులకు సంబంధించిన పార్శ్వ న్యుమోథొరాక్స్ వస్తుంది. ఫలితంగా ఊపిరి తీసుకోలేక ప్రాణాంతకంగా మారవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం ఇన్‌ఫ్లూయెంజా, సైటో మెగాలో, ఎప్సిన్ బార్ వైరస్‌లతో పాటు కోవిడ్–19 వైరస్‌లు కూడా గులియన్ బ్యారో సిండ్రోమ్‌కు కారణాలుగా తెలిశాయి.

వ్యాధి సోకితే

వ్యాధి సోకిన వారు బలహీనంగా ఉంటారు. నడిచేటప్పుడు విపరీతమైన అలసటకు గురవుతారు. ఊపిరి తీసుకునే కండరాలు బలహీనపడుతాయి. నడవలేరు. మెదడు నుంచి శరీరమంతా ప్రయాణించే నరాలకు చెందిన మైలిన్ పొర పాడై నాడీవ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. మాట్లాడేటప్పుడు, నడిచేటప్పుడు బ్యాలెన్సింగ్ ఉండదు. గుండె స్పందన రేటు పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. జీర్ణశక్తి మందగిస్తుంది.

పెద్దాస్పత్రిలో 20 మందికి చికిత్స

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఈ సంవత్సర కాలంలోనే 20 మందికి జీబీఎస్ వ్యాధికి న్యూరాలజి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించారు. అందరూ కోలుకున్నారు. వీరికి పెద్దాస్పత్రిలో ఇంట్రావీనస్ ఇమ్యునోగ్లోబులిన్ (ఐవీఐజీ) అనే ఖరీదైన ఇంజెక్షన్‌లు ఇస్తూ కోలుకునేలా చేశారు. అందులో ఇద్దరు గర్భిణులకు కూడా చికిత్స అందించి నయం చేశారు. రోజు మార్చి రోజు 5 సైకిల్స్‌లో ఇంజెక్షన్లు ఇచ్చే వారు.

తాజాగా..

సోమవారం బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన 45 ఏళ్ల ఓ వ్యక్తి జీబీఎస్ లక్షణాలతో ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. ఆయనకు రక్తనమూనాలు తీసి నిర్ధారణకు బయట ల్యాబ్‌కు పంపించారు. లక్షణాలను బట్టి జీబీఎస్‌గా అనుమానిస్తున్నారు. ఇలాగే పలు కార్పొరేట్ ఆస్పత్రులలో పదుల సంఖ్యలో జీబీఎస్‌తో చికిత్స పొందుతున్నారు.



మందులు ఖరీదుగా మారడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇందుకు సంబంధించిన ఇంజక్షన్ల సరఫరాను జీజీహెచ్‌కి ఆపేసింది. ఆగస్టు నెల నుంచి సరఫరా కావడం లేదు. పెద్దాస్పత్రి అధికారులు ఎన్ని దఫాలు ఇండెంట్ పెడుతున్నా ప్రభుత్వం మందులు సరఫరా చేయడం లేదు. దీంతో ఆగస్టు నుంచి ఇందుకు సంబంధించిన వైద్యసేవలు అందించడం మానేసి తిరుపతి లాంటి హయ్యర్ సెంటర్లకు రెఫర్ చేస్తున్నారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లలేని నిరుపేద రోగులు నగరంలోని నారాయణ, అపోలో లాంటి ఆస్పత్రులకు వెళ్తూ వైద్యం చేయించుకుంటూ అప్పులపాలవుతున్నారు. రోగులు కోలుకోవాలంటే ఇమ్యునో గ్లోబులిన్ ఇంజెక్షన్‌ల ద్వారా చికిత్స చేస్తారు. ఈ ఇంజక్షన్ ఒక గ్రాము ఖరీదు రూ.11వేలు. రోజుకు 5 గ్రాములు ఇంజెక్షన్ ఇవ్వాలి. ఇలా 5 రోజులు ఇవ్వాలి. మరో రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలి. అత్యవసరమైన వారికి ప్లాస్మాపెరోసిస్ చికిత్స చేస్తారు. ఈ చికిత్సకు ఒక్క సైకిల్‌కు రూ.లక్ష ఖర్చు అవుతుంది. దీంతో మనిషి కండిషన్‌ను బట్టి రూ.4 లక్షల నుంచి రూ.10లక్షలకు పైగానే ఒక్క రోగి ఖర్చు చేయాల్సి ఉంది.



పెద్దాస్పత్రిలో గులియన్ బ్యారో సిండ్రోమ్ వ్యాధిని నిర్ధారించే ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేయడం లేదు. వ్యాధిని నిర్ధారించేందుకు పరీక్షలకు బయటకు పంపుతున్నారు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి బయట పరీక్షలు చేయించుకుంటున్నారు. వ్యాధి నిర్ధారణ చేసేందుకు కేవలం రూ.5 లక్షలు మంజూరు చేస్తే ఈ పరీక్షలను పెద్దాస్పత్రిలోనే చేయవచ్చు. అయితే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో డాక్టర్లు వైద్యం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరోగ్యశ్రీలో చేర్చుకోవడం లేదు. జీబీఎస్ సోకిన రోగులను ఆరోగ్యశ్రీలో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చేర్చుకోవడం లేదు. బయట 3 నుంచి రూ.4 లక్షల ఖరీదైన వైద్యం, మందులు, ఇంజెక్షన్లు చేస్తే ఆరోగ్యశ్రీలో రూ.50 వేలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో గిట్టుబాటు కాక ప్రైవేటు ఆస్పత్రుల వారు రోగులను ఆరోగ్యశ్రీ కింద చేర్చుకోవడానికి నిరాకరిస్తున్నారు.

కేసులు లేవంట



ఇంత జరుగుతున్నప్పటికీ జిల్లాలో జీబీఎస్ కేసులు ఒక్కటి కూడా లేవని డీఎంహెచ్ఓ డాక్టర్ వి.సుజాత తెలిపారు. రోగులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుంటే వైద్యశాఖ చోద్యం చూస్తోంది. కేసులు లేవంటూ దాచి పెడుతున్నారు.

భయపడాల్సిన పనిలేదు



జీబీఎస్ కేసులు గురించి భయపడాల్సిన పని లేదు. నిదానంగా కోలుకుంటారు. తిమ్మిర్లు, కాళ్లలో చచ్చుబడినట్టు ఉండటం, బ్యాలెన్స్ తగ్గిపోవడం లాంటి లక్షణాలుంటే సత్వరమే సమీప వైద్యశాలలో డాక్టర్ సలహాలను పొంది చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, పెద్దాస్పత్రి

రూ.కోట్లు కొల్లగొట్టి.. పోలీసులకు చిక్కి..

- కావలిలో మనీ స్కామ్ సూత్రధారి మహబూబ్ సుభాని అరెస్ట్
- అతని ప్రధాన అనుచరుడు కూడా..
- బ్యాంక్ అకౌంట్లు, నగదు, ఆస్తులు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీధర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్. చిత్రంలో సీఐలు, వెనుక ముసుగులో నిందితులు

కావలి: కావలి పట్టణంలో షేర్ మార్కెట్ ట్రేడింగ్ ముసుగులో జనాల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన ప్రధాన నిందితుడు షేక్ మహబూబ్ సుభాని, అతని ప్రధాన అనుచరుడైన మరో నిందితుడు యలసిరి బ్రహ్మానందంను అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పుల్లూరు శ్రీధర్ చెప్పారు. కావలిలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కావలిలో అనంతార్థ అసోసియేట్స్ పేరుతో 17 మంది కలిసి షేర్ మార్కెట్ ఫైనాన్సియల్ ట్రేడింగ్‌ను 2021లో ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుదాస లీలా స్టాక్ మార్కెట్ ఏజెన్సీ పేరుతో కూడా మరొక సంస్థను ప్రారంభించారు. దీనికి ముఖ్య సూత్రధారి షేక్ మహబూబ్ సుభాని. అలాగే ప్రభుదాస లీలా స్టాక్ మార్కెట్ ఏజెన్సీకి యలసిరి బ్రహ్మానందం హెడ్‌గా ఉన్నారు. వీరు అధిక వడ్డీ ఆశ పెట్టి ప్రజలు నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముఖ్య సూత్రధారి షేక్ మహబూబ్ సుభాని కార్యాలయాన్ని మూసేసి పరారయ్యాడు. మందా ప్రభాకర్ అనే వ్యక్తి ముఖ్య సూత్రధారి షేక్ మహబూబ్ సుభానిపై ఫిర్యాదు అందడంతో కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

ఇదీ సూత్రధారి సుభాని నేపథ్యం

బాపట్ల జిల్లా ఏల్చూరుకు చెందిన షేక్ మహబూబ్ సుభాని విజయవాడలోని సిద్దార్థ అకాడమీలో ఎంసీఏ పూర్తి చేసి నరసరావుపేటలో కొంతకాలం కంప్యూటర్ లెక్చరర్‌గా పనిచేశాడు. తర్వాత నెట్వర్క్ మార్కెటింగ్ రంగంలోకి వచ్చి షేర్ మార్కెట్ ట్రేడింగ్ మీద అవగాహన పెంచుకున్నాడు. గుంటూరు, విజయవాడలో కొంతకాలం పనిచేసి, తర్వాత కుటుంబంతో కలిసి కర్ణాటకలోని బీదర్, మహారాష్ట్రలోని పూణేలలో కొంత కాలం ఉన్నాడు.

కాకినాడలో...

తర్వాత కాకినాడకు మకాం మార్చి డబ్బులు షేర్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలకు నమ్మకం కలిగించాడు. ఆన్‌లైన్ షేర్ ట్రేడింగ్ ముసుగులో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసుకుంటూ, క్రమంగా ఒక పెద్ద నెట్వర్క్‌ను సృష్టించాడు. ఏజెంట్ల ద్వారా కోట్ల రూపాయలు వసూలు చేసిన తర్వాత కాకినాడ నుంచి పారిపోయాడు. దీంతో సుభాని మీద కాకినాడ పోలీస్ స్టేషన్‌లో 2014లో చీటింగ్ కేసు నమోదు అయింది.

తెలంగాణలో...

కొంతకాలానికి సుభాని తెలంగాణ రాష్ట్రం మక్తల్ ప్రాంతానికి వెళ్లి చెప్పులు, ఫెర్టిలైజర్, బంగారం వ్యాపారాలు చేశాడు. అక్కడ కూడా ప్రజలను మభ్యపెట్టి షేర్ మార్కెట్ ముసుగులో కోట్ల రూపాయలు ప్రజల నుంచి సేకరించి పారిపోయాడు. దీంతో మక్తల్, మరికల్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు అయ్యాయి. దీంతో అరెస్ట్ కాకుండా సుభాని మాయమైపోయాడు. నిందితుడు పోలీసుల కంటపడకుండా అరెస్టు కాకుండా తెలివిగా జాగ్రత్త పడ్డాడు.

కావలిలో...

2021 నవంబర్‌లో కావలి పట్టణం ముసునూరు ప్రాంతంలో ఒక ఇల్లు అద్దెకి తీసుకొని అనంతార్థ అసోసియేట్స్ అనే ఏజెన్సీని స్థాపించాడు. షేర్ మార్కెట్ ముసుగులో కొంతమంది ఏజెంట్లను నియమించుకుని ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. ప్రజల సొమ్ముతో తన కుటుంబ సభ్యుల పేరుతో, తన ఏజెన్సీలోని వ్యవస్థాపక సభ్యుల పేర్లతో కొన్ని స్థిరాస్తులు కొన్నాడు. నిందితుడు సుభాని, అతనికి సహకరించిన కావలికి చెందిన యలసరి బ్రహ్మానందంను కావలి రూరల్ పోలీస్ స్టేషన సీఐ జి.రాజేశ్వరరావు ఆదివారం రాత్రి గౌరవరం దగ్గర అరెస్టు చేశారు. అతని ఆస్తులకు సంబంధించిన కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకొని, బ్యాంకులో ఉన్న నగదు స్వాధీనం చేసుకొనేందుకు చర్యలు తీసుకున్నారు. సుభానికి ఇవ్వడం ద్వారా ప్రజలు పోగొట్టుకున్న డబ్బు తాలూకు వివరాలను దర్యాప్తులో తేలుస్తామని డీఎస్పీ తెలిపారు. సుభాని కొనుగోలు అనేక ఆస్తులు, బ్యాంకు అకౌంట్లు ఇప్పటికే గుర్తించి ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు.

వీరే సభ్యులు

అనంతార్థ అసోసియేట్స్‌లో సుభానితో పాటు ఈపలపూడి కమలకుమార్, చలంచర్ల అనిల్, పిల్లి సామ్రాజ్ రోషీ్ద్ బో, యలసిరి బ్రహ్మానందం, గోనె కిరణ్, యలసిరి ఆదినారాయణ, తలపల శివశంకర్, అద్దూరి శీనయ్య, చౌటూరి అశోక్, నిమ్మగడ్డ రాంరాబర్ట్ రహీం, కాకిని ప్రశాంతి, వట్టికాల ప్రశాంతి, బుట్టి శివార్జున, కొట్టి పుష్పలత, జ్యోతి ప్రవంతి, గుళ్లమూరి వంశీరెడ్డిలు సభ్యులని డీఎస్పీ వివరించారు. ఈ మనీ స్కాంలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్ల భార్యలు ఉన్నారని గుర్తించి వారిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పోలీస్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇలాంటి మనీ స్కాంలో ఉండటం నేరంగా భావించి ఈ చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. పోలీస్ కానిస్టేబుళ్ల వట్టికాల రాధాకృష్ణ భార్య వట్టికాల ప్రశాంతి, జ్యోతి అయోధ్య కుమార్ భార్య జ్యోతి ప్రవంతిలు ఉన్నారని తెలిపారు.

వివరాలు తెలియజేయండి...

సుభాని ద్వారా మోసపోయిన బాధితులు వివరాలు తెలియజేయాలని డీఎస్పీ శ్రీధర్ సూచించారు. ఇప్పటి వరకు 150 మంది ఫిర్యాదు అందజేశారని అన్నారు. వారందరి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.25 కోట్ల వరకు వసూలు చేసినట్లుగా తెలుస్తోందని డీఎస్పీ చెప్పారు.

సీజ్ చేసిన నగదు, ఆస్తులు

ప్రధాన నిందితుడితోపాటు సభ్యుల బ్యాంక్ అకౌంట్‌ల నుంచి రూ.5,35,92,126లు సీజ్ చేసినట్లు తెలిపారు. సుభాన్ కుటుంబసభ్యుల పేర్లతో స్థిరాస్తులు రూపేణా ఉన్న రూ.5,74,51,000 విలువ కలిగిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే సుభాని నివాసంలో రూ.28,48,600 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీతోపాటు కావలి రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు, వన్ టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్, టు టౌన్ సీఐ వేల్పుల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని చంపేసి.. భూముల్ని తీసుకోండి

- సమాచారం ఇవ్వకుండా మా భూముల్లో సర్వేలు చేయడమేంటి
- కావలి ఆర్డీఓకు మొరపెట్టుకున్న తీర ప్రాంత గ్రామాల రైతులు



ఆర్డీఓకు తమ గోడు తెలియజేస్తున్న రైతులు

కావలి: మా భూముల్లోకి రెవెన్యూ అధికారులు వచ్చి భూములు తీసుకుంటున్నాం, సర్వే చేస్తున్నాం అంటూ హడావుడి చేస్తున్నారు. ఎందుకు తీసుకుంటున్నారో.. ఎన్ని ఎకరాలు తీసుకుంటున్నారో.. ఇవేవీ మాకు చెప్పడం లేదు. ఇలా చేసే బదులు మమ్మల్ని చంపేసి మా భూములు తీసుకోండి అంటూ కావలి మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు చెందిన రైతులు కావలి ఆర్డీఓ ఎం.వంశీకృష్ణ వద్ద ఆవేదన వ్యకం చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆర్డీఓను పెద్ద సంఖ్యలో రైతులు కలిశారు. రామాయపట్నం పోర్టుకు సమీపంలో ఉన్న వేలాది ఎకరాలు భూములను సేకరించడానికి కూటమి ప్రభుత్వం దూకుడు పెంచిన విషయం తెలిసిందే. సాంకేతికంగా మారిటైం బోర్డు ద్వారా భూసేకరణ జరుగుతున్నా ఈ ప్రక్రియలో కావలి తహసీల్దార్ కింద పని చేసే రెవెన్యూ ఉద్యోగులే క్రియాశీలకంగా ఉంటూ వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారు. భూసేకరణలో ప్రధాన ఘట్టమైన గ్రామసభ నిర్వహించే విషయం రైతులకు తెలియలేదు. దీంతో సోమవారం చెన్నాయపాళెం, పాముగుంటపాళెం, మూలంపేట, పెద్దపట్టపుపాళెం, నందెమ్మపురం, చిన్నపాళెం, పల్లెపాళెం, శ్రీరాంపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆర్డీఓను కలిశారు. ఈ గ్రామాల్లో 3,000 ఎకరాలు భూసేకరణ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వ్యవసాయ భూములతో బతుకుతున్న తాము జీవనోపాధి కోల్పోతే ఎలా బతకాలి? ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు వరకు ధర ఉన్న భూములకు ఎంతోకొంత నష్ట పరిహారం ఇస్తామని చెప్పడం మమ్మల్ని అవమానపరచడం కాదా? అంటూ రైతులు ప్రశ్నించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసేలా చేయడంలో పొరపాటు జరిగిందని, అలాంటి పొరపాటు పునరావృతం కాకుండా జాగ్రత్త పడతానని చెప్పారు. మీరు తెలియజేసిన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని అన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల పొట్టగొడుతున్నారు

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు
- ర్యాలీగా కలెక్టరేట్‌కు... జేసీకి వినతిపత్రం అందజేత



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు

నెల్లూరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఉపాధి హామీ పనులు కట్టబెడుతూ కూలీల పొట్టగొడుతోందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడు ఆలపాక శ్రీనివాసులు విమర్శించారు. ఆ పార్టీకి చెందిన పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సోమవారం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలపాక శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదని 2024లో ఇచ్చిన కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం 50శాతం పనులను కచ్చితంగా కూలీలతో చేయించాల్సి ఉందన్నారు. గ్రామ సభలు ఆమోదం పొందిన పనులు మాత్రమే చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా కూటమి నేతలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని గ్రామసభల తీర్మానం లేకుండా కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారన్నారు. దీంతో తాము కోర్టుకెళ్లగా అలా ప్రైవేటు కాంట్రాక్టర్లకు కేటాయించిన పనులు రద్దు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఉపాధి చట్టం అమలులో ప్రధాన భూమిక పోషిస్తున్న డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓ, పీఓ, ఏపీఓలు, సంబంధిత జిల్లా అధికారులే జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఏఎస్‌పేట ఎంపీపీ పద్మజారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

21న మామిడి సాగుపై క్రాప్ సెమినార్

నెల్లూరు(సెంట్రల్): ఈ నెల 21న మామిడి పంటపై జిల్లా స్థాయి క్రాప్ సెమినార్ కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలువురు శాస్త్రవేత్తలు మామిడి పంటలో తెగుళ్ల నివారణ, సాగులో పలు సూచనలు ఇస్తారన్నారు. మామిడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అక్రమ మైనింగ్‌పై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి పంచాయతీలో 2023లో అక్రమంగా మైనింగ్‌కు పాల్పడ్డారని మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్కే హనీఫ్ కథనం మేరకు వివరాలు.. పేర్నేటి శ్యాంప్రసాద్, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి అక్రమంగా మైనింగ్ చేసి తెల్లరాయిను తరలించారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

వేటకెళ్లి మత్స్యకారుడి మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తోటపల్లిగూడూరు: వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్సై వీరేంద్ర బాబు సమాచారం మేరకు.. వెంకన్నపాళెంపట్టపుపాళెం గ్రామానికి చెందిన కొండూరు వెంకటేశ్వర్లు (51) సముద్రంలో వేటపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వెంకన్నపాళెం పట్టపుపాళెం సమీపంలోని సముద్రతీరం గుండా ఇంజిన్ బోటుపై వేటకు బయల్దేరాడు. సోమవారం ఉదయానికి కూడా వెంకటేశ్వర్లు తీరానికి చేరుకోకపోవడంతో తోటి మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇందుకూరుపేట మండలం కొరుటూరు సమీపంలోని తీరంలో వెంకటేశ్వర్లు మృతదేహం బయటకు కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు వెంకటేశ్వర్లకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శివయ్యా.. నీ భూములెక్కడయ్యా..

దేవుడి సొమ్మే కదా.. అడిగే వారెవరని దేవదాయశాఖాధికారులు అనుకుంటున్నారు. స్వామి వారి మాన్యాలనే కాకుండా.. కౌలు సొమ్మును 'తిలాపాపం తలా పిడికెడు' చందంగా తమ జేబుల్లో వేసుకుంటున్నారు. సుమారు ఆరు శతాబ్దాల క్రితం నిర్మించిన అలనాటి చారిత్రక చిహ్నాలకు, ఆధ్యాత్మికతకు నిలయమైన రామలింగేశ్వరస్వామి దేవాలయం నానాటికి జీర్ణావస్థకు చేరుకుంటోంది. వందలాది ఎకరాల మాన్యాలు ఉన్నప్పటికీ కనీసం ధూపదీప నైవేద్యాలకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. ఆలయ పాలకులుగా వ్యవహరిస్తున్న దేవదాయశాఖాధికారులు కనీసం జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టాలనే ఆలోచన చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి, అవినీతికి పరాకాష్టగా మిలుగుతోంది.

260.62 ఎకరాల భూమికి ఆసామి

- అయినా ధూపదీప నైవేద్యాలకు నోచుకోని వైనం
- జీర్ణావస్థలో వలేటివారిపాళెం రామలింగేశ్వర శివాలయం
- 138.55 ఎకరాల భూమి అన్యాక్రాంతం
- 93 ఎకరాలకే అరకొరగా కౌలు జమ
- ఆలయ సొమ్మును అప్పనంగా ఆరగిస్తున్న దేవదాయశాఖ అధికారులు

వలేటివారిపాళెం: వలేటివారిపాళెం గ్రామానికి పశ్చిమాన కొలువైన రామలింగేశ్వరస్వామి కోవెల ఉంది. క్రీస్తు శకం 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు పాలనలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ ఆలయ ఆలనా పాలనా స్థానికంగా ఉండే పుచ్చకాయల రెడ్లు చూస్తుండే వారు. అప్పట్లో ఆలయంలో స్వామి వారికి నిత్య కైంకర్యాల నిమిత్తం భూస్వాములు, దాతలు భూములను మాన్యాలుగా ఏర్పరిచారు. సుమారుగా 260.62 ఎకరాల మాన్యం ఉన్నట్లు పాత రెవెన్యూ రికార్డులను బట్టి తెలుస్తోంది. అయితే ఇందులో కొంత భూమిని గతంలో అధికారంలో ఉన్న పాలకులు పేదలకు ఇంటి నివేశన స్థలాలుగా, సాగు భూమి పట్టాలుగా ఇచ్చారు. అయితే ఆ భూమికి సంబంధించి పరిహారం దేవదాయశాఖకు జమ చేసినట్లు పెద్దలు చెబుతున్నారు. కానీ ఆ నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి

జీర్ణావస్థలో శివాలయం

వలేటివారిపాళెంలోని వంద కోట్ల రూపాయల ఆస్తులు మాన్యాలుగా ఉన్నప్పటికీ ఆలయం నానాటికి శిథిలావస్థకు చేరుకుంటుంది. ఆలయానికి ఏటా రూ.లక్షల్లో కౌలు వేలం ద్వారా రాబడి వస్తున్నప్పటికీ కనీసం జీర్ణోద్ధరణ చేపట్టాలని అధికారులు కానీ, పాలకులు కానీ పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 15వ శతాబ్దంలో నిర్మితమైన ఈ ఆలయం ఆ నాటి చారిత్రక చిహ్నంగా అయిన భావితరాలకు గుర్తుండిపోయేలా అభివృద్ధి చేయాలనే ఆలోచన, చిత్తశుద్ధి అధికారులకు, పాలకులకు లేకపోవడం బాధాకరం.


శిథిలావస్థలో ఉన్న శివాలయం

231.55 ఎకరాల భూమి ఉన్నా..

గతంలో ఆలయానికి దాతలిచ్చిన భూముల్లో కొంత పేదలకు పంచి పెట్టినా.. చివరకు 231.55 ఎకరాల భూమి మిగిలి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు వెల్లడి చేస్తున్నాయి. అయితే ఇందులో కేవలం 93 ఎకరాలకే అరకొరగా కౌలు వేలం నిర్వహిస్తున్నారు. అంటే మిగతా 138.55 ఎకరాల భూములు పరాధీనం అయినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో దేవదాయశాఖాధికారులు తెలుసు. అయితే వీటికి సంబంధించి తమ వద్ద రికార్డులు లేవని చెబుతూ సదరు భూములకు సంబంధించి అనధికారికంగా కౌలు సొమ్మును దండుకుని తమ జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవాలయానికి రూ.కోట్లు విలువ చేసే భూముల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ అరకొరగానే రాబడి వస్తుంది.

40 ఏళ్ల నుంచి వేలం లేని వైనం

చుండి రెవెన్యూ గ్రామంలో దేవాలయానికి 9 ఎకరాల భూమి ఉంది. ఖాతా నం 307లో కేవలం 2.22 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైంది. మిగిలిన 7.21 అనాధీనంగా ఉంది. ఈ భూమితో పాటు పొన్నలూరు మండలం మాలపాడులో ఖాతా నంబరు 02, సర్వే నంబర్ 197–2లో 14.70 ఎకరాలు, వలేటివారిపాళెంలోని 113.85 ఎకరాల భూములను ఆ శాఖలో గతంలో ప్రస్తుతం గుమస్తాలుగా, ఈఓలుగా పనిచేస్తున్న వారు దాదాపు 40 ఏళ్లుగా రహస్యంగా కౌలు వేలం వేసి నిధులు స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ప్రస్తుత ఈఓ పీ కార్తీక్‌ను సాక్షి వివరణ కోరగా తన దగ్గర ఎటువంటి రికార్డులు లేవని, చూసి తర్వాత చెప్తానని సమాధానం ఇచ్చారు. రికార్డులు లేనప్పుడు జెడ్ ఉప్పలపాడు, అంకభూపాలపురం, పోలినేనిపాళెం భూములు ఏ విధంగా వేలం నిర్వహించారని ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా ఫోన్ పెట్టేశారు.

దేవాలయాన్ని ఆదుకుంటున్న దాతలు

శిథిలావస్థలో ఉన్న రామలింగేశ్వర ఆలయాలన్ని దాతలు ఆదుకుంటున్నారు. వలేటివారిపాళెం గ్రామానికి చెందిన నర్ర రంగయ్య దంపతులు రూ. 5 లక్షల విలువైన మార్బుల్, గ్రానైట్ అందజేశారు. అంకభూపాలపురం గ్రామానికి చెందిన పెగడ శ్రీనివాసరావు తన స్నేహితులతో కలిసి గుడి ముందు రూ.4 లక్షలతో నవగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రతి శివరాత్రికి గ్రామంలో శివ మాల వేసే యువకులు, గ్రామంలోని కొంత మంది భక్తులు అన్నదానం నిర్వహిస్తున్నారు. దాతలు చేసిన అభివృద్ధి తప్ప దేవదాయశాఖ కాని, కూటమి ప్రభుత్వం కాని ఎటువంటి అభివృద్ధికి చేసిన దాఖలాలు లేవు.

138.55 ఎకరాలు పరాధీనం

రామలింగేశ్వర ఆలయానికి వలేటివారిపాళెం సర్వే నంబర్ 213, 251–2, 331, 419–2, 127–4 నంబర్లలో 113.85 ఎకరాల భూములున్నాయి. ఇందులో 99 ఎకరాలకు పైగా భూమి కొందరు అక్రమార్కుల చేతుల్లో ఉంది. అయితే ఈ భూములు ఎవరి అధీనంలో ఉన్నాయో దేవదాయశాఖాధికారులకు తెలుసు. వీటికి సంబంధించి ఏటా అనధికారికంగా కౌలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ ఈ భూముల వివరాలను మాత్రం దేవదాయశాఖ రికార్డుల్లో చూపించడం లేదు. ఇందులో మిగిలిన 14.85 ఎకరాల భూమికి సైతం కౌలు వేలం నిర్వహించడం లేదు. ఇవికాకుండా మండల పరిధిలోని జెడ్ ఉప్పలపాడులో 71 ఎకరాలు, పోలినేనిపాళెంలో 14 ఎకరాలు, చుండిలో 9 ఎకరాలు, అంకభూపాలపురంలో 8 ఎకరాలు, పొన్నలూరు మండలం మాలపాడులో 14.70 ఎకరాల చొప్పున మొత్తం 117.70 ఎకరాలు ఉన్నాయి. ప్రస్తుతం దేవదాయశాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం మొత్తం 133.55 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించాల్సి ఉండగా ఇందులో జెడ్ ఉప్పలపాడు, పోలినేనిపాళెం, అంకభూపాలపురంలో ఉన్న 93 ఎకరాలకే కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన 40.55 ఎకరాల భూమిని సదరు ఆలయ ఈఓ ఆధ్వర్యంలోనే అక్రమ వేలం నిర్వహిస్తున్నట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

ఈఓ మీద చర్యలు తీసుకోవాలి



గతేడాది నవంబర్‌లో జెడ్ ఉప్పలపాడులో 70.32 ఎకరాల వేలం నిర్వహించారు. మా గ్రామంలో ఉన్న కొంత మంది రైతులతో కలిసి పోలీసుల సహకారంలో రూ.12 లక్షలు ఆదాయం రావాల్సింది. కేవలం రూ.4 లక్షలకే వేలం ముగించారు. ఈఓ కార్తీక్ మీద ఉన్నత అధికారులు విచారించి కఠిన చర్యలు తీసుకోవాలి.

– వింజం వెంకటేశ్వర్లు, జెడ్ ఉప్పలపాడు సర్పంచ్

కౌలు వసూలు చేసుకుంటున్నారు



చుండిలో ఆలయానికి 9.43 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఈఓ బహిరంగ వేలం నిర్వహించకుండా కొంత మంది రైతుల దగ్గర కౌలు వసూలు చేస్తున్నారు. మా గ్రామంలో ఇప్పటికీ కౌలు వేలం వేసిన చరిత్ర లేదు. ఇప్పటికైనా దేవదాయశాఖాధికారులు కలుగజేసుకోవాలి. ఆలయ భూములు ఎంత ఉన్నాయో సర్వే చేసి కౌలు వేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.

– ఇరుపని సతీష్, చుండి సర్పంచ్

ప్రాక్టికల్స్‌కు 143 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సోమవారం 143 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం ప్రాక్టికల్స్‌కు 2,685 మందికి 73 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2,216 మందికి 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ శ్రీనివాసులు కేంద్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి భాషోత్సవాలు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మంగళవారం నుంచి భాషోత్సవాలను నిర్వహించాలని డీఈఓ ఆర్.బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఇంగ్లిష్, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన భాష, కన్నడ, తమిళం, ఒరియా 21న తెలుగు భాషకు సంబంధించి ఉత్సవాలను జరపాలని చెప్పారు. ఇందు కోసం ఒక్కో పాఠశాలకు రూ.500 నిధులు కేటాయించినట్లు తెలిపారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)
పెద్దవి : రూ .47
సన్నవి : రూ.30
పండ్లు : రూ.10



వెల్లువెత్తుతున్న వినతులు


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర విద్యార్థి విభాగ నాయకులు


ర్యాలీగా వస్తున్న నేషనల్ మైనారిటీ సెల్ నాయకులు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 472 అర్జీలు

నెల్లూరురూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఈ కార్యక్రమానికి అత్యధికంగా ఫిర్యాదులు వస్తున్నాయంటే.. క్షేత్రస్థాయిలో అధికారులు, పరిపాలన తీరుఎలా ఉందో ఈ వినతులే అద్దం పడుతున్నాయి. వారం వారం వచ్చే అర్జీల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత వారం వరకు 400 వస్తున్న అర్జీలు ఈ వారం 472కు చేరాయి. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్‌తో పాటు డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీఓ శ్రీధర్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయొద్దు

విద్యార్థులను మార్కుల కోసం పాఠశాలల యాజమాన్యాలు మానసికంగా ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నగర విద్యార్థి నాయకుడు తిరకాల శేషసాయి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, అఫ్రోజ్, జస్వంత్, సాయి పాల్గొన్నారు.

స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారు...

ఆరు నెలల నుంచి పలు జిల్లాల్లో గిరిజనులపై జరుగుతున్న దాడులపై అనేక సార్లు సంబంధిత పోలీస్‌శాఖ వారికి గ్రీవెన్స్ సందర్భంగా వినతిపత్రాలు సమర్పిస్తే వాళ్లు స్థానిక ఎస్‌హెచ్‌ఓలకు పంపుతున్నారని, వారు ఎవరైతే ఫిర్యాదుదారులు ఉన్నారో వాళ్లను స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు రాగి పోలమ్మ, హైమావతి, సింహాద్రి, మాధవి, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, వక్ఫ్ జేపీసీ రిపోర్టు, ప్రతిపక్ష ఎంపీల గొంతు నొక్కి వందల కోట్ల విలువ చేసే ఆస్తులను అన్యాక్రాంతం చేసి ముస్లిం సమాజానికి అన్యాయం చేసే కుట్రలను తీవ్రంగా విభేదిస్తున్నామని, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలంటూ నేషనల్ మైనార్టీ సెల్ నాయకులు ర్యాలీగా వచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రతిపక్షాలు చెబుతున్న సవరణలను స్వీకరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయిలో మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 100
లేయర్ (లైవ్) : 80
బ్రాయిలర్ చికెన్ : 184
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 206
లేయర్ చికెన్ : 136



మమ్మల్ని ఆదుకోండి సారూ..

- ఎస్పీ కృష్ణకాంత్‌కు బాధితుల మొర
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 93 ఫిర్యాదులు


సమస్యలను ఎస్పీకి వివరిస్తున్న బాధితులు

నెల్లూరు(క్రైమ్): నమ్మించి మోసం చేశారు.. న్యాయం చేయాలని బాధితులు ఎస్పీ జి. కృష్ణకాంత్‌ను కోరారు. సోమవారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 93 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతులు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్, ఆత్మకూరు డీఎస్పీలు చెంచురామారావు, వేణుగోపాల్ రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని..

సాఫ్ట్‌వేర్ జాబ్ (వర్క్ ఫ్రమ్ హోమ్) ఉద్యోగాలు ఇప్పిస్తానని పొదలకూరుకు చెందిన ఎస్. భగవాన్ అనే వ్యక్తి నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.1.60 లక్షలు తీసుకున్నాడు. దీంతోపాటు ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి మాకు తెలియకుండా ఒక్కొక్కరి పేరుపై రూ.3 లక్షలు లోన్ తీసుకుని నకిలీ జాబ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు ఇచ్చాడు. నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు. విచారించి న్యాయం చేయాలని నెల్లూరు బాలాజీనగర్, కోవూరు, గుడ్లూరు, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన పలువురు కోరారు.

రూ 1.25 లక్షలు తీసుకుని..

తన కుమారుడికి వెటర్నరీ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన నూర్జాహాన్ రూ.1.25 లక్షలు తీసుకుంది. నెలలు గడుస్తున్నా.. ఉద్యోగం ఇప్పించకపోవడంతో ఆమెను నిలదీయగా సమాధానం దాటేస్తుంది. తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కోరారు.

- నా పేరుపై ఉన్న స్థలం పత్రాలు తీసుకుని పెద్ద కొడుకు వేధిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేసింది.
- భూ వివాదంపై తిరుపాల్, కిశోర్, రమణమ్మ తమపై దాడిచేశారు. మాకు తీవ్రగాయాలయ్యాయి. చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు మాపైనే కేసుల నమోదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మండలం బండారుపల్లికి చెందిన బాధితులు కోరారు.
- మా అమ్మమ్మ ఆత్మకూరు బస్టాండు సమీపంలో పూల వ్యాపారం చేస్తోంది. గుర్తుతెలియని ఇద్దరు యువకులు ఆమెపై దాడిచేశారని, ఆమె ఒంటిపై కాల్చిన గాయాలున్నాయి. వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరుకు యువకులు కోరారు.